సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



డీసీసీబీ డిజిటలైజేషన్..!

వ్యవసాయ పరపతి సంఘాలను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయి. 12లో



మార్పు మనతో మొదలవ్వాలి

సమాజం మారాలంటే.. ముందుగా మనతోనే మార్పు మొదలవ్వాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. 12లో



ఏ దిల్ మ్యాంగో మోర్

పద్మనాభం మండలం కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ గ్రామాల్లో ఈ సీజన్‌లో కూడా మామిడి కాయలు కాస్తున్నాయి. 12లో

గంటాకు పోస్టింగుల తంటా!



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

ఇప్పటికే మంత్రి పదవి దక్కకపోవడంతో లోలోన కుమిలిపోతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావుకు తాజాగా తన నియోజకవర్గంలోని పోస్టింగుల విషయంలోనూ అవమానాలు ఎదురవుతున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా సీఐల పోస్టింగుల విషయంలో ఆయన సిఫారసు చేసిన వాటిలో కేవలం ఒక్కరికి మాత్రమే పోస్టింగు దక్కడం చర్చనీయాంశమవుతోంది. అందులోనూ సిఫారసు చేసిన స్టేషన్‌కు కాకుండా మరో స్టేషన్‌కు కేటాయించారని కూడా తెలుస్తోంది. వాస్తవానికి పీఎం పాలెం పోలీసుస్టేషన్ సీఐగా దుర్గా ప్రసాద్‌కు కానీ ఎర్రంనాయుడుకు కానీ పోస్టింగ్ ఇవ్వాలని సిఫారసు చేసినట్టు సమాచారం. వాళ్లకు కాకుండా బాల

- సిఫారసులో ఒక్క సీఐకే పోస్టింగు
- అది కూడా కోరిన చోట కాకుండా మరో చోట కేటాయింపు
- జనసేన ఎమ్మెల్యేల ఎపిసోడ్‌తో మిన్నకుండిపోయిన వైనం
- ఇదంతా స్థానిక నేతలా పనా.. పై నుంచి వచ్చిన ఆదేశాలా..
- క్యాడర్‌లో అయోమయం

కృష్ణకు పోస్టింగు దక్కింది. మరోవైపు బాలకృష్ణకు పద్మనాభంలో పోస్టింగు ఇవ్వాలని గంటా సిఫారసు చేసినట్టు తెలుస్తోంది. తాను సిఫారసు చేసిన స్టేషన్‌కు కాకుండా... ఇంకొకరికి సిఫారసు చేసిన స్టేషన్ ఇవ్వడం ఏమిటని వాపోతున్నట్టు సమాచారం. ఇక భీమిలి స్టేషన్‌కు వాసునాయుడును సిఫారసు చేస్తే... అది కాస్తా సుధాకర్‌కు పోస్టింగు దక్కింది. ఆనందపురం స్టేషన్‌లోనూ సిఫారసు చేసిన వారికి కాకుండా మరొకరికి దక్కినట్టు తెలుస్తోంది. మొత్తంగా సిఫారసుల్లో కేవలం ఒకరి పేరును మాత్రమే పరిగణలోనికి తీసుకోగా.. అది కూడా కోరినచోట కాకుండా మరో చోట పోస్టింగు ఇవ్వడం పట్ల ఆయన వర్గీయులు గుర్రుమంటున్నారు. స్థానికంగా ఉన్న పార్టీ నేతలా? పై నుంచి వచ్చిన ఆదేశాలతో ఇదంతా జరుగుతోందా? అని తేల్చుకోలేకపోతున్నట్టు సమాచారం. మరోవైపు తాజాగా జనసేన ఎమ్మెల్యేల ఎపిసోడ్‌తో పోస్టింగుల విషయంలో మరీ రచ్చచేయకూడదనే నిర్ణయానికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

జనసేన ఎమ్మెల్యేల ఎపిసోడ్‌తో..

వాస్తవానికి జనసేన ఎమ్మెల్యేలు కూడా పోస్టింగుల విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తాము చెప్పిన వారికి పోస్టింగులు దక్కకపోవడంతో ఏకంగా తమ గన్‌మెన్లను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని నగర పరిధిలోని ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఒక అడుగు ముందుకు వేసి గన్‌మెన్‌ను వెనక్కి పంపారు. ఆ తర్వాత పోలీసు ఉన్నతాధికారితో మాట్లాడిన ఎమ్మెల్యేలకు చేదు సమాధానం వచ్చినట్టు తెలుస్తోంది. తన పోస్టింగులు నచ్చకపోతే తననే మార్చుకోవచ్చంటూ పోలీసు ఉన్నతాధికారి సమాధానమివ్వడంతో మింగుడుపడలేదని సమాచారం. దీంతో చేసేదేమీ లేక వెనక్కి పంపిన గన్‌మెన్‌ను తిరిగి తన వద్దే ఇప్పటికే పంచకర్ల చేర్చుకోగా... సోమవారం గన్‌మెన్లను వెనక్కి పంపాలనుకున్న వంశీకృష్ణ మిన్నకుండిపోయారు. జనసేన ఎమ్మెల్యేల ఎపిసోడ్‌తో గంటా కూడా పోస్టింగుల విషయంలో మిన్నకుండిపోయినట్టు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేల చుట్టూ తిరిగినా పోస్టింగ్‌లు దక్కని సీఐలు... ఆశ చావక మళ్లీ ఇప్పుడు వారి ఇంటి చుట్టూనే చక్కర్లు కొడుతున్నారు.

ఎవరి హస్తం ఉంది..?

హోంశాఖ మంత్రికి గంటాకు మధ్య విభేదాలు ఉన్నాయన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలోనే పాయకరావుపేట నియోజకవర్గంలో గంటా వర్గంగా ఉన్న కొద్ది మంది అనితకు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఈ విషయాన్ని అనిత స్వయంగా చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లింది. చంద్రబాబు ఆదేశాల మేరకు స్వయంగా గంటా పాయకరావుపేట నియోజకవర్గానికి వెళ్లి... అసంతృప్తులతో మాట్లాడి అనితకు అనుకూలంగా పనిచేసేలా చూశారు. అయినప్పటికీ ఇప్పుడు తాను



అడిగిన పోస్టింగులు రాకుండా హోంశాఖ మంత్రి అనిత అడ్డుకున్నారని గంటా వర్గీయులు భావిస్తున్నారు. కేవలం హోంశాఖ మంత్రి హస్తం ఉందా? పై నుంచి వచ్చిన ఆదేశాలతో ఇక్కడ ఉన్న పోలీసు ఉన్నతాధికారులు తమ నేత సిఫారసు చేసిన వారికి పోస్టింగులు ఇవ్వలేదా అనే మీమాంసంలో కూడా గంటా వర్గీయులు ఉన్నట్టు తెలుస్తోంది. ఏదీ ఏమైనప్పటికీ ఒకప్పుడు జిల్లా అంతటా ఏకఛత్రాధిపత్యం వహించిన తమ నేత.. ఇప్పుడు కనీసం నియోజకవర్గంలో కూడా పోస్టింగులు తెప్పించుకోలేని దుస్థితిలో ఉన్నారేమిటని వాపోతున్నారు. సీఐల పోస్టింగుల విషయమే ఇలా ఉండగా... పలువురు తహసీల్దార్లు ఇప్పటికే పోస్టింగుల కోసం లేఖలు తెచ్చుకుని సమర్పించారు. వీటి పరిస్థితి ఏమవుతుందోననేది కొన్ని రోజుల్లో తేలనుంది.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ప్రైవేట్ ఆస్పత్రుల యాజమన్యాల సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రుల్లో ప్రమాదవశాత్తూ అగ్ని, ఇతర ప్రమాదాలు జరిగితే వెంటనే డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆస్పత్రుల్లో ఫైర్ ఆడిట్, ఎలక్ట్రిసిటీ ఆడిట్, మాక్ డ్రిల్ క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ రోగుల నుంచి అదనపు రుసుం వసూలు చేయరాదని, మందులు, ల్యాబ్ టెస్టుల్లో కూడా అక్రమ వసూళ్లకు పాల్పడొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, 2002 ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. క్లినిక్‌లు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు శుభవార్త

మూడు రోజుల పాటు లడ్డూల విక్రయాలు



శ్రీవారి ఆలయంలో లడ్డూ విక్రయాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం(టీటీడీ)లో ఇకపై వారంలో మూడు రోజులు లడ్డూలు విక్రయించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ప్రతి నెలా రెండవ శనివారం మాత్రమే శ్రీవారి లడ్డూలను విక్రయించామని.. భక్తుల కోరిక మేరకు గురు, శుక్ర, శనివారాల్లో కూడా లడ్డూలను విక్రయిస్తామని వెల్లడించారు.

క్రిమి సంహారక మందులు వినియోగిస్తే చర్యలు



పండ్లను తనిఖీ చేస్తున్న ఆహార భద్రతాధికారి అప్పారావు

మహారాణిపేట: జిల్లాలో విక్రయిస్తున్న పండ్లు, ఆకుకూరలు, కూరగాయల్లో మోతాదుకు మించి క్రిమి సంహారక మందులను వాడినట్లు నిర్ధారణ అయితే ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా ఉంటుందని ఆహార భద్రత అధికారి జి.వి.అప్పారావు హెచ్చరించారు. ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం 2006 లోని సెక్షన్ 59 ప్రకారం ఈ చర్యలు ఉంటాయ ని స్పష్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఎంత మోతాదులో క్రిమి సంహారక మందులు వినియోగిస్తున్నారో తెలుసుకోవాలని ఆదేశించారు. నగర పరిధిలోని రైతుబజార్లు, ప్యూర్ ఓ నేచురల్, రిలయన్స్, మోర్ తదితర సూపర్ మార్కెట్లలో విక్రయిస్తున్న కూరగాయలు, ఆకు కూరలు, పండ్లలో విచ్చలవిడిగా పురుగుల మందులను చల్లుతున్నట్లు తమ దృష్టికి వచ్చింద న్నారు. మంగళవారం పలు సంస్థలు, సూపర్ బజార్లు, పలు రైతు బజార్లలో తనిఖీ చేసి 34 శ్యాంపిళ్లను ఫుడ్ ల్యాబ్‌కి పంపినట్లు చెప్పారు. మోతాదుకు మించి క్రిమి సంహారక మందులను వాడినట్లు నిర్ధారణైతే చర్యలు తీసకుంటామన్నారు.

5,6 తేదీల్లో జిల్లా అథ్లెటిక్ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జట్ల ఎంపిక ఈనెల 5, 6వ తేదీల్లో విశాఖ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జరగనుంది. ఏయూ గ్రౌండ్స్‌లో అండర్ 15, 16, 18, 20, 23 ఏళ్ల బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నారు. ఎంపికలో పాల్గొనే వారు ప్రతీ ఈవెంట్‌కు రూ.100 ప్రవేశరుసుంగా చెల్లించాలని సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

నేటి స్థాయీ సంఘ సమావేశం రద్దు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరగాల్సిన జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం రద్దయినట్లు జీవీఎంసీ కార్యదర్శి ఫణిరామ్ తెలిపారు. వరద ముంపు సహాయక చర్యల్లో పాల్గొనేందుకు జీవీఎంసీ అధికారులు విజయవాడకు వెళ్లినందున రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం

మేయర్ హరి వెంకటకుమారి పిలుపు



మట్టి గణపతి ప్రతిమలు అందజేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా నగర ప్రజలు వినాయక చతుర్థి నాడు మట్టి గణపతినే పూజించాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పిలుపునిచ్చారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఆమె ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నగర వాసులపై ఉందన్నారు. వినాయక ప్రతిమల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ), థర్మకోల్ వాడడం వల్ల అందులో ఉన్న రసాయనాలు పర్యావరణానికి హాని కలిగించడమే గాక, సముద్ర జలాలు కలుషితమవుతాయన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రకృతిని గౌరవించకపోవడం వల్ల మనం అనేక విపత్తులు చూస్తున్నామని, కాలుష్యంలో విశాఖ నగరం అగ్రస్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో కాలుష్యం పెరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. మట్టి వినాయక ప్రతిమలకు అధిక ప్రాధాన్యమిచ్చి పూజించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆహ్వానితులకు మట్టి వినాయక ప్రతిమలు అందించారు. అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, డీవీ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, యూసీడీ పీడీ ఫణిరామ్, ఎస్ఆర్‌యూ కో–ఆర్డినేటర్ శ్రీనివాస రాజమణి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు తొత్తుగా కేంద్ర ప్రభుత్వం



సంఘీభావం తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు

- స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే ఊరుకోం
- ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రమేంద్రకుమార్ హెచ్చరిక



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ శ్రేణులు

సీతమ్మధార: పరిశ్రమల యాజమాన్యాలకు కేంద్రం తొత్తుగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రమేంద్రకుమార్ ఆరోపించారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీపార్కులో మంగళవారం జరిగిన ఏఐటీయూసీ జాతీయ మహాసభల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఫార్మాసిటీలో భద్రత కరువై ఎందరో కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని విచారం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు హరించి ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్నారన్నారు. బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతోందని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. జాతీయ కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 1,200 రోజులకుపైగా పోరాటం చేస్తున్నా.. కేంద్రం స్పందించడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం వచ్చిన బిడ్డర్లను కార్మికులు ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రానివ్వలేదని గుర్తు చేశారు. ఎందరో ప్రాణత్యాగంతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. పార్లమెంట్‌లో ఎటువంటి చర్చా లేకుండా ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు బ్లాక్‌డే పాటించాలని నిర్ణయించాయన్నారు. ఫార్మా బాధితుల పరామర్శకు వచ్చిన సీఎం చంద్రబాబు గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రమాదాల గురించి చెప్పారని.. అతను అధికారంలో ఉన్న 2014–19లో జరిగిన ప్రమాదాల సమయంలో ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో పదేళ్లుగా కనీస వేతన సవరణ మండలి లేదన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఏఐటీయూసీ విశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జి.అచ్యుతరావు, అనకాపల్లి ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు ఎం.భద్రం, రాజబాబు, అల్లూరి ఏఐటీయూసీ కార్యదర్శి అమర్, విజయనగరం కార్యదర్శి బుగత అశోక్, రంగరాజు, శ్రీకాకుళం నాయకులు షణ్ముఖరావు, గోవింద్, కాకినాడ జిల్లా నేత తోకల ప్రసాద్, విశాఖ నేతలు కసిరెడ్డి సత్యనారాయణ, బూసి వెంకటరావు, కె.సత్యాంజనేయ, జేడీ నాయుడు, ఎస్.కె.రహమాన్ పాల్గొన్నారు.

కదంతొక్కిన కార్మికులు : ఉక్కునగరం గురజాడ కళాక్షేత్రంలో మూడు రోజులుగా జరుగుతున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు మంగళవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా జీవీఎంసీ గాంధీ పార్కులో బహిరంగ సభ జరిగింది. ముందుగా సరస్వతి పార్కు వద్ద ర్యాలీ ప్రారంభమైంది. డాబాగార్డెన్స్, సెంట్రల్ పార్కు, జైలురోడ్డు మీదుగా గాంధీ పార్కు వద్దకు చేరుకుంది. వేలాదిమంది కార్మికులు ఎర్రజెండాలతో తరలి వచ్చారు.

వేట సాగక.. పూట గడవక



హార్బర్‌లో నిలిచిన మరబోట్లు

- వారం రోజులుగా వేటకు వెళ్లని గంగపుత్రులు
- 'అల'జడులతో ఇళ్లకే పరిమితం
- చిల్లి గవ్వలేక అల్లాడుతున్న మత్స్యకారులు
- జాడలేని 'మత్స్యకార భరోసా'

మహారాణిపేట: మత్స్యకారులకు వాతావరణం అనుకూలించడం లేదు. ఇప్పుడిప్పుడే చేపలు, రొయ్యలు లభ్యత ఆశాజనకంగా ఉందనుకున్న సమయంలో ప్రకృతి 'అల'జడి రేపింది. వేట నిషేధం అనంతరం కొద్ది రోజులుగా వేట సజావుగా సాగగా.. వారం రోజుల నుంచి అల్పపీడనం, వాయుగుండంతో వాతావరణం ప్రతికూలంగా మారింది. ఈదురు గాలులు వీయడం, సముద్రంలో కెరటాల ఉధృతి పెరగడం, అండర్ కరెంట్(వడి) వంటి కారణాల వల్ల వేటకు వీలు పడడం లేదు. ఈ పరిస్థితుల్లో వలలు వేస్తే తెగిపోవడంతో పాటు బోట్లు తిరగబడే ప్రమాదం ఉంటుంది. ఈ క్రమంలో వాతావరణ శాఖ హెచ్చరికలతో మత్స్యకారులు ఎక్కడికక్కడే బోట్లను లంగరు వేశారు. మరపడవలను ఒడ్డుకే పరిమితం చేశారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి మరపడవలు, మోటారు బోట్లు, ఇంజిన్ లేని తెప్పలతో వేట సాగిస్తుంటారు. అల్పపీడనం ప్రభావంతో సగానికి పైగా బోట్లు ఇప్పుడు ఒడ్డునే ఉంచేసినట్టు మత్స్యకారులు చెబుతున్నారు. మరో మూడు నాలుగు రోజుల వరకు ఇదే వాతావరణం కొనసాగుతుందని ఆ శాఖాధికారులు చెబుతున్నారు. దీంతో మొత్తం మీద వారం పది రోజులు వేటకు వీలు కాని పరిస్థితి తలెత్తిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ ద్వారా సుమారు 12 వేల కుటుంబాలు చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. పలు రకాల వ్యాపారాలతో లక్ష మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఫిషింగ్ హార్బర్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. వీరందరికీ ఇప్పుడు ఉపాధి లేక ఆవేదన చెందుతున్నారు.

'మత్స్యకార భరోసా'పై ఉలుకు లేదు

కొన్నాళ్ల నుంచి రొయ్యలు, చేపల ధరలు ఆశాజనకంగా లేవు. మరోవైపు పెరిగిన డీజిల్ ధర మత్స్యకారులకు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అయినా ఆదుకుంటుందా అంటే అదీ లేదు. కష్టకాలంలో మత్స్యకారులను ఆదుకోవడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన మత్స్యకార భరోసా పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచింది. మత్స్య సంపద సంరక్షణ, పునరుత్పత్తి కోసం ఏటా 61 రోజుల పాటు వేట నిషేధం ఉంటుంది. ఆ సమయంలో మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం పరిహారం అందజేయడం పరిపాటి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్న సమయంలో అర్హులైన మత్స్యకారుల జీవన భృతికి ఒకరికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. ఇలా 2019లో 18,925 మంది, 2020లో 20,273, 2021లో 11,193, 2022లో 11,389, 2023లో 11,334 మందికి పరిహారం అందించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి ఏడాదే మత్స్యకారులకు మొండిచేయి చూపింది. మే/జూన్‌లో ఇవ్వాల్సిన పరిహారంపై ఇప్పటికీ ఉలుకూ..పలుకూ లేదు. ఈ క్రమంలో వాతావరణ మార్పులతో వేట సాగక.. పూట గడవని పరిస్థితుల్లో మత్స్యకారులు అల్లాడుతున్నారు.

కాలం కలిసి రావడం లేదు



ఒక పక్క రొయ్యలు, చేపలకు ఆశించిన స్థాయిలో ధర ఉండటం లేదు. మరోపక్క డీజిల్ ధర భారంగా మారింది. దీంతో మత్స్యకారులకు చేపలవేట గిట్టుబాటు కావడం లేదు. ఇలాంటి సమయంలో అల్పపీడనం కారణంగా ఐదారు రోజులుగా వేట సాగడం లేదు. మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అంటే పది రోజులు వేట మానుకోవాల్సి వస్తోంది. ఈ సీజన్‌లో మత్స్యకారులకు కాలం కలిసి రావడం లేదు. – **సూరాడ సత్తిబాబు**, ఉపాధ్యక్షుడు, విశాఖ డాల్ఫిన్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్

వేట ఉంటేనే తిండి

వారం రోజుల నుంచి చేపల వేటకు వెళ్లడం లేదు. ఇప్పుడు మళ్లీ తుపాను ఉందని అంటున్నారు. మరో మూడు నాలుగు రోజులు వేట ఉండదు. ఆ తర్వాత వినాయక చవితి, ఆ రెండు రోజులు కూడా వేట చేయడం కుదరదు. వేట ఉంటేనే తిండి దొరుకుతుంది. మా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.

– **బాలాజీ**, జాలారిపేట

మామూళ్ల 'మత్తు'

- అవినీతికి కేరాఫ్‌గా ఆబ్కారీ శాఖ
- నిబంధనలను పాతరేస్తున్న బార్ అండ్ రెస్టారెంట్లు
- ఫైర్ ఎన్‌వోసీ లేకుండా బార్ల నిర్వహణ
- ఫుడ్‌లైసెన్స్ లేకుండా ఐదు బార్లలో రెస్టారెంట్లు
- ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఆరు బార్లు
- పోలీసుల తనిఖీల్లో వెల్లడి..

విశాఖ సిటీ : విశాఖ ఆబ్కారీ శాఖ అవినీతికి కేరాఫ్‌గా మారిపోయింది. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. నగరంలో బార్ అండ్ రెస్టారెంట్లు నిబంధనలకు పాతరేస్తున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వీటిలో సగానికి పైగా బార్లు అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీ లేకుండా నడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కొన్ని బార్లు ట్రేడ్ లైసెన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్నా అడిగే నాథుడు లేడు. మరికొన్ని రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నా.. ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా బార్ అండ్ రెస్టారెంట్లు, బార్‌ల్లో డ్రగ్స్, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి.

60 బార్లకు ఫైర్ ఎన్‌వోసీలు లేవు

నగరంలో 92 బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లు ఉన్నాయి. ఎన్నికల సమయంలో తప్ప అంతకు ముందు గానీ, ఆ తర్వాత గానీ తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో కొన్ని బార్లలో ఎమ్మార్పీ కంటే అధికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. తాజాగా పోలీసుల తనిఖీల్లో అసలు వాస్తవాలు వెలుగుచూశాయి. నగరంలోని 92 బార్లు, పబ్‌లలో 60 బార్లకు ఫైర్ శాఖ నుంచి ఎన్‌వోసీ లేనట్లు గుర్తించారు. నిత్యం వందల మంది మందుబాబులు వచ్చిపోయే ఈ బార్లు ముఖ్యమైన అనుమతులు సైతం లేకుండా నిర్వహించడం విశేషం. చాలా కాలంగా ఇదే తరహాలో బార్లు, పబ్‌లు నడుపుతున్నా ఎక్సైజ్ శాఖ గానీ, అగ్నిమాపక శాఖ అధికారులు గానీ పట్టించుకోకపోవడం విశేషం. ఏదైనా ప్రమాదం జరిగే మాత్రం రెండు, మూడు రోజులు హడావుడి చేయడం తప్ప ముందస్తు జాగ్రత్త తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. అలాగే ఐదు బార్లలో ఫుడ్ లైసెన్సులు లేకుండా రెస్టారెంట్లు నిర్వహిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఆరు బార్లకు ట్రేడ్ లైసెన్సులు కూడా లేవు. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఆరు బార్ అండ్ రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్‌కు బదులు డొమెస్టిక్



సిలిండర్లు వినియోగిస్తున్నారు. అలాగే 33 బార్లకు కనీస పార్కింగ్ సదుపాయం లేదు.

మామూళ్ల మత్తులో ఎక్సైజ్

బార్ అండ్ రెస్టారెంట్లలో అనుమతులు, లోటుపాట్లు ఉన్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. ఇప్పటి వరకు నిబంధనలను అనుగుణంగా బార్లు నిర్వహిస్తున్నారా? లేదా? అన్న విషయాలను పట్టించుకోలేదు. ప్రతి నెలా వచ్చే మామూళ్ల మత్తులో ఉండిపోవడంతో బార్ల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు గత ప్రభుత్వం ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటు చేసింది. ఎక్సైజ్ శాఖలో కొంత మందిని ఆ విభాగంలో నియమించింది. దీంతో వారి ఆదాయానికి గండిపడినట్లయింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సెబ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. వారంతా మళ్లీ ఎక్సైజ్‌లోకి రావడంతో మామూళ్లు దండిగా వస్తాయన్న సంతోషంతో కొంతమంది ఏకంగా బాణాసంచా కాల్చుకొని సంబరాలు కూడా చేసుకోవడం గమనార్హం.

గాలి నాణ్యత మెరుగునకు చర్యలు

అల్లిపురం: నగరంలో గాలి నాణ్యత మెరుగుపరచేందుకు జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రొగ్రాంలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీఈపీడీసీఎల్, ఆర్టీవో, ఏపీఎస్ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసు, వ్యవసాయ శాఖ, గ్రేటర్ విశాఖ సిటిజన్ ఫోరం ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన జంక్షన్లను విస్తరించే పనులు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో 250 కిలోమీటర్ల రోడ్లను మెకానికల్ స్వీపింగ్ యంత్రాలతో శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. వ్యర్థాలను తరలిస్తున్నప్పుడు టార్పాలిన్‌లతో పూర్తిగా కప్పి ఉంచాలని సూచించారు. రోడ్లపై ధూళిని తగ్గించేందుకు 40 అడుగులపైగా వెడల్పు ఉన్న ప్రధాన రహదారులను ఎండ్ టు ఎండ్ రోడ్లుగా మార్పు చేస్తామన్నారు. పరిశ్రమల నుంచి వెలువడే విషవాయువులను నియంత్రించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రోజూ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించి అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, రౌండ్ అబౌట్‌లు నిర్మించేందుకు ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే విభాగాలకు సహకరిస్తామని కమిషనర్ తెలిపారు.

నైట్ బీట్ పోలీసులపై దాడి

మద్రిపాలెం: నైట్ బీట్ విధులు నిర్వహిస్తున్న ఓ సీసీఎస్ ఏఎస్ఐ, కంచరపాలెం క్రైం హోంగార్డుపై పూల దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి, అతని కుటుంబ సభ్యులు దాడి చేశారు. వివరాలివీ.. కంచరపాలెం రైతుబజార్ పక్కన కృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి పూల దుకాణం నడుపుతున్నాడు. సోమవారం రాత్రి సీసీఎస్ ఏఎస్ఐ, హోంగార్డు ముక్కళ్ల రవి నైట్ డ్యూటీ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో 10 గంటల నుంచి షాపు మూసేయమని కృష్ణకు వారు చెప్పారు. అయినా సరే రాత్రి 11 గంటల వరకు అతను షాపు మూయలేదు. ఈ క్రమంలో పోలీసులు మళ్లీ అడగ్గా.. కృష్ణ, అతని కుటుంబ సభ్యులు సుమిత్, లక్ష్మి సహనం కోల్పోయారు. పోలీసులపై దుర్భాషలాడుతూ.. మీరెవరు అడగడానికి అని తిరగబడి దాడి చేశారు. ఈ క్రమంలో హోంగార్డు ముఖం మీద గాయాలయ్యాయి. అతని ఫిర్యాదు మేరకు విధులకు ఆటంకం కలిగించి గాయపరిచిన ముగ్గురిపై కేసు నమోదైంది. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ కె.కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు ఓ రౌడీషీటర్ బంధువులని పోలీసులు తెలిపారు.

పండగల వేళ ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: రాబోయే పండగల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆయా మార్గాల్లో దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. భువనేశ్వర్–బెలగావి (02813) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి శనివారం రాత్రి 7.15గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి అర్ధరాత్రి దాటిన తర్వాత 1.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.55 గంటలకు బయలుదేరి సోమవారం తెల్లవారు 3 గంటలకు బెలగావి వెళ్తుంది. ఈ స్పెషల్ సెప్టెంబరు 7 నుంచి నవంబరు 30వ తేదీ మధ్య రాకపోకలు సాగిస్తుంది. తిరుగు ప్రయాణంలో బెలగావిలో ప్రతి సోమవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.10 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. ఈ స్పెషల్ సెప్టెంబరు 9 నుంచి డిసెంబరు 2వ తేదీ మధ్య నడుస్తుంది.

● తిరుపతి–శ్రీకాకుళంరోడ్(07440) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ తిరుపతిలో ప్రతి ఆదివారం సాయంత్రం 5.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.57 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్ వెళ్తుంది. ఈ స్పెషల్ అక్టోబర్ ఆరు నుంచి డిసెంబరు ఒకటో తేదీ మధ్య నడుస్తుంది. శ్రీకాకుళం రోడ్–తిరుపతి (07441) స్పెషల్ ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.02 గంటలకు బయలుదేరి మరసటి రోజు ఉదయం 8.20 గంటలకు తిరుపతి వెళ్తుంది. ఈ స్పెషల్ అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2వ తేదీ మధ్య నడుస్తుంది.

● నాందేడ్–బ్రహ్మపూర్ (07431) స్పెషల్ నాందేడ్‌లో ప్రతి శనివారం మధ్యాహ్నం 3.25 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఆదివారం ఉదయం 9.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.27 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ అక్టోబర్ 12 నుంచి నవంబర్ 30వ తేదీ మధ్య నడుస్తుంది. బ్రహ్మపూర్ –నాందేడ్(07432) స్పెషల్ బ్రహ్మపూర్‌లో ప్రతి ఆదివారం సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.40 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి రాత్రి 9.42 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు నాందేడ్ వెళ్తుంది. ఈ స్పెషల్ అక్టోబరు 13 నుంచి డిసెంబరు 1వ తేదీ మధ్య రాకపోకలు సాగిస్తుంది.

నేడు పలు రైళ్ల రద్దు : విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పునరుద్ధరణ చర్యల కారణంగా బుధవారం నాందేడ్–విశాఖపట్నం(20812) సూపర్‌ఫాస్ట్, పుదుచ్చేరి–హౌరా (12868) సూపర్ ఫాస్ట్, సికింద్రాబాద్–విశాఖపట్నం–సికింద్రాబాద్ (20707/ 20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం(20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. మిగిలిన రైళ్లు యథాతథంగా నడుస్తాయి..

నేడు సికింద్రాబాద్‌కు వన్ వే స్పెషల్ : భారీ వర్షాల కారణంగా ఆయా స్టేషన్లలో నిలిచిపోయిన ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు వన్ వే ఏసీ స్పెషల్ నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–సికింద్రాబాద్(08511) వన్ వే ఏసీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రాత్రి 7.50 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.25 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గంటూరు, స్టేషన్‌లలో ఆగుతుంది.

డీసీసీబీ డిజిటలైజేషన్..!

- సొసైటీల రికార్డుల కంప్యూటరీకరణ
- డీసీసీబీ చరిత్రలో ఇదే తొలిసారి
- నాబార్డ్ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్
- సభ్యుల సమస్త వివరాల సేకరణ



మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

విశాఖ విద్య: వ్యవసాయ పరపతి సంఘాలను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయి. నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) ఆదేశాలతో డీసీసీబీ అధికార యంత్రాంగమంతా ప్రస్తుతం ఇదే పనిలో నిమగ్నమైంది. ఈ సంఘాల్లో సభ్యత్వం పొందిన రైతులు, వివిధ రకాల రుణాలు పొందిన వారి సమస్త వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి నాటి నుంచి సొసైటీల్లోని అన్ని రకాల కార్యకలాపాలు ఆన్‌లైన్ ద్వారానే జరగాలనే ఉన్నతాధికారుల ఆదేశాలతో డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని తమ యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. డేటా సేకరణపై ప్రతి రోజు సంఘాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

బినామీలకు చెక్ పెట్టేలా..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో 98 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్) ఉన్నాయి. వీటిలో 3,88,179 మంది సభ్యులున్నారు. సొసైటీల్లో సభ్యత్వం పొందిన వారికి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నారు. చాలా చోట్ల రైతుల పేరుతో బినామీలు చొరబడి ప్రభుత్వ సబ్సిడీ రుణాలను కొల్లగొడుతున్నారని ఫిర్యాదులున్నాయి. ఇలాంటి వాటిపై నాబార్డు దృష్టి పెట్టింది. వీటికి అడ్డుకట్ట వేసేలా సహకార సంఘాల్లోనూ ఆన్‌లైన్ ద్వారానే కార్యకలాపాలు నిర్వహించాలనే నాబార్డు ఆదేశాలకు అనుగుణంగా డీసీసీబీ అధికారులు చర్యలు చేపట్టారు.

‘డీసీటీ’లో సభ్యుల సమగ్ర వివరాలు

సొసైటీల వారీగా సభ్యులకు చెందిన భూములు, ఆస్తులు, వారు తీసుకున్న రుణం, కుటుంబ పరిస్థితి వంటి సమగ్ర వివరాలను నాబార్డ్ ప్రత్యేకంగా రూపొందించిన డేటా క్యాప్చర్ టూల్(డీసీటీ) అనే వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఆధార్ నంబర్‌తో ఆ వివరాలను అనుసంధానిస్తుండటంతో దేశంలో ఎక్కడైనా బ్యాంకుల్లో వీరి వివరాలు పరిశీలించే అవకాశం ఉంటుంది. రుణ గ్రహీతల వివరాలను సకాలంలో గుర్తించేందుకు వీలుగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం సొసైటీల్లో సిబ్బంది అంతా ఇదే పనిలో నిమగ్నమవడంతో ఖరీఫ్ రుణాల మంజూరులో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.

అందుబాటులో లేని రికార్డులతో తర్జన భర్జన

సొసైటీలో సభ్యుల డేటా సేకరణ సవ్యంగా ముందుకు సాగడం లేదు. విశాఖ జిల్లాలోని 13 సొసైటీల్లో 60,668 మంది సభ్యులుండగా.. వీరిలో ఇప్పటివరకు 11,843 మంది సభ్యుల వివరాలు సేకరించారు. 8,889 మంది వివరాలను డీసీటీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. అల్లూరి జిల్లాలోని 11 సొసైటీల్లో 27,831 మంది సభ్యులకు గాను 7,812 మంది సభ్యుల వివరాలు సేకరించారు. 2,500 మంది వివరాలను అప్‌లోడ్ చేశారు. అనకాపల్లి జిల్లాలోని 74 సొసైటీల్లో 2,99,660 మంది సభ్యులుండగా.. వీరిలో ఇప్పటివరకు 1,08,255 మంది వివరాలను సేకరించి.. 86,775 మంది డేటాను అప్‌లోడ్ చేశారు. సభ్యుల వివరాల కంప్యూటరీకరణ డీసీసీబీ చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో చాలా మంది వివరాలు సొసైటీల్లో అందుబాటులో లేని పరిస్థితి ఉంది.

భవిష్యత్తు అవసరాలకు ఎంతో మేలు



సహకార సంఘాల కంప్యూటరీకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. దీని వల్ల పారదర్శకతతో పాటు భవిష్యత్తులో రుణాలు సకాలంలో పొందేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా, ఉన్నతాధికారుల సూచనలతో గడువులోగా సభ్యుల సమస్త సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా ప్రతి రోజూ సొసైటీల వారీగా సమీక్షిస్తున్నాం. ఆన్‌లైన్ పనులతో ఖరీఫ్ రుణాల మంజూరుకు ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం.

– డి.వి.ఎస్.వర్మ, డీసీసీబీ సీఈవో

ఏ దిల్ మ్యాంగో మోర్

- కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడలో రెండు సీజన్లలో మామిడి దిగుబడి
- రైతులకు అదనపు ఆదాయం


కొత్త కొవ్వాడలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న మామిడి కాయలు


పాత కొవ్వాడలో కాసిన పాలం బారామస్ మామిడి కాయలు


పాలం బారా మస్ మామిడి పండ్లు

పద్మనాభం: సాధారణంగా వేసవి కాలంలో మామిడి కాయలు కాస్తాయని మనందరికీ తెలుసు. అయితే కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ గ్రామాల్లో ప్రస్తుతం కూడా మామిడి కాయలు కాస్తున్నాయి. ఇక్కడ రైతులు ‘చిడత పూడి’, ‘పాలం బారామస్’ అనే రెండు రకాల మామిడి చెట్ల ద్వారా ఏడాదికి రెండు సార్లు ఆదాయం పొందుతున్నారు. వ్యవసాయ రంగంలో వినూత్న విధానాలను అనుసరిస్తూ.. ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ గ్రామాల్లో వేసవి కాలంలో మే వరకు మొదటి పంటను ఇచ్చే ఈ చెట్లు, తర్వాత వెంటనే పూతకు వచ్చి ఆగస్టు రెండవ వారం నుంచి సెప్టెంబర్ మొదటి వారం వరకు రెండవ పంటను ఇస్తాయి. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ తోటలు ప్రతి ఏడాది రైతులకు మంచి ఆదాయాన్ని అందిస్తున్నాయి. పాలం బారామస్ మామిడి ఒక ఎకరానికి సుమారు ఒక టన్ను దిగుబడినిస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో ఒక టన్ను పాలం బారామస్‌కు రూ.50,000 ధర పలుకుతోంది. చిడత పూడి కూడా ఒక ఎకరానికి సుమారు ఒక టన్ను దిగుబడినిస్తుంది. అయితే, ప్రస్తుతం ఒక టన్ను చిడత పూడి రూ.15,000 నుంచి రూ.20,000 వరకు మాత్రమే పలుకుతోంది. ఒడిశా రాష్ట్రం రాయపూర్ వంటి ప్రాంతాల నుంచి వ్యాపారులు నేరుగా కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ గ్రామాలకు వచ్చి ఈ మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ఈ రెండు రకాల మామిడికీ మంచి డిమాండ్ ఉండేది. అయితే ఈ ఏడాది మాత్రం చిడత పూడి రకం మామిడి కాయలను వ్యాపారులు కొనడానికి ఆసక్తి చూపడం లేదని పాత కొవ్వాడకు చెందిన రైతు బి.దుర్గారావు తెలిపారు. ‘చిడత పూడిని ఆవకాయ తయారీకి ఉపయోగిస్తారు. పాలం బారామస్ పండ్లుగా తినడానికి ఉపయోగ పడతాయి. అందుకే వీటికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది’ అని వివరించారు. ఈ ఏడాది చిడతపూడికి డిమాండ్ తగ్గడం రైతుల్లో కొంత ఆందోళన కలిగిస్తోంది.

మార్పు మనతోనే మొదలవ్వాలి

ఎంపీ శ్రీభరత్


మొక్కకు నీరు పోస్తున్న ఎంపీ శ్రీభరత్


మొక్కలకు నీరు పోస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు


మొక్క నాటుతున్న విదేశీ విద్యార్థులు

విశాఖ సిటీ: సమాజం మారాలంటే.. ముందుగా మనతోనే మార్పు మొదలవ్వాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో ‘ఏక్ పేడ్ మాకే నామ్’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 1,000 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీభరత్ మాట్లాడుతూ ఏయూను డ్రగ్ ఫ్రీ, ప్లాస్టిక్ ఫ్రీ, గ్రీన్ క్యాంపస్‌గా తీర్చిదిద్దేందుకు వీసీ జి.శశిభూషణరావు చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు ఆరోగ్యకరమైన మార్గాలను అన్వేషించాలని సూచించారు. అసాంఘిక శక్తులకు దూరంగా విశ్వవిద్యాలయాలను ఉంచాలన్నారు. అనంతరం ఏయూ ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన గ్రీన్ ర్యాలీని ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు, డీన్లు, అధికారులు, ఇక్కడ చదువుతున్న విదేశీ విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమాలపై ఆసక్తే దర్శకుడ్ని చేసింది

- వెండితెరపై సత్తాచాటుకుంటున్న కశింకోట కుర్రోడు
- మూడు సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్
- కల్కితో ‘సాక్షి’ చిట్‌చాట్

అనగనగా ఓ కుర్రాడు. వెండితెరపై వెలగాలని కలలుగన్నాడు. చేతిలో చిల్లిగవ్వ లేకపోతేనేం, కలలకు మాత్రం కొదవలేదు. ఇంట్లో వాళ్లు వారించారు. స్నేహితులు చెప్పి చూశారు. కానీ తను ఆగలేదు. తపన వీడలేదు. చదువు పూర్తయిన తరువాత హైదరాబాద్ బండి ఎక్కేశాడు. ఆ మహానగర కూడలిలో అయోమయంగా నిలబడ్డాడు. పొద్దున్నే సినిమా స్టూడియోల ముందు వాలిపోవడం, వచ్చేపోయే వాళ్ల ముందు తన టాలెంట్ చూపించడం దినచర్యగా మారింది. ఆ క్రమంలో ఊహించని అవకాశం వచ్చింది. దర్శకుడు సముద్రఖని వద్ద సహాయకుడిగా చేరాడు. ఆ కాస్త పట్టు చాలు.. అంచెలంచెలుగా ఎదగడానికి..దశాబ్దం తిరిగేసరికల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో డైరెక్టర్‌గా ఎదిగాడు అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన కొల్లు కల్కి. ఇటీవల తిమ్మాపురంలో ఓ చిత్ర షూటింగ్ నిమిత్తం వచ్చిన సందర్భంగా ‘సాక్షి’కి ఇంటర్వ్యూ ఇచ్చారు. – కొమ్మాది

సాక్షి: షార్ట్ ఫిల్మ్స్ ద్వారా మీ ప్రస్థానం ప్రారంభమైందా?

కల్కి: చదువుకున్న సమయంలోనే సినిమాలన్నా, కథలన్నా చాలా ఆసక్తి ఉండేది. డిగ్రీ పూర్తయిన తరువాత షార్ట్ ఫిల్మ్స్ ట్రెండ్ మొదలైంది. సుమారు 20కు పైగా షార్ట్ ఫిల్మ్‌లకు దర్శకత్వం వహించా. శ్రీనుగాడి ప్రేమ, సిన్సియర్ మామ మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి.

సాక్షి: టాలీవుడ్‌లో అవకాశం ఎలా వచ్చింది?

కల్కి: సినిమాలపై అసక్తితో చదువు పూర్తయిన తరువాత అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్లా. షూటింగ్ ఎక్కడ ఉన్నా వెళ్లేవాడ్ని. ఈ క్రమంలో రవితేజ నటించిన శంభో శివశంభో సినిమా చిత్రీకరణ జరుగుతున్నప్పుడు దర్శకుడు సముద్రఖని దగ్గర సహాయకుడిగా చేరా.

సాక్షి: : అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో–డైరెక్టర్‌గా ఎన్ని సినిమాలు చేశారు?


దర్శకత్వ పర్యవేక్షణలో కొల్లు కల్కి

కల్కి: నటుడు రాజేంద్రప్రసాద్ నటించిన నూతిలో కప్పలు, జంప్, ప్రేమలో ఇద్దరు అనే సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశా. అదే విధంగా ఇటీవల విడుదలైన సాయికుమార్ నటించిన లక్ష్మీ కటాక్షం, హనీ ట్రాప్ అనే సినిమాలకు కో– డైరెక్టర్‌గా వ్యవహరించా.

సాక్షి: నాలుగు భాషల్లో సినిమానా?

కల్కి: ఔనండి. నేటి సమాజానికి ఉపయోగపడే ఒక సందేశాత్మకమైన కథతో వాట్ లగా దేంగే అనే పేరుతో తీశాం. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తమిళ భాషల్లో తీశాం. త్వరలో ఓటీటీ వేదికగా రిలీజ్ చేయబోతున్నాం.


నటీనటులకు సన్నివేశం వివరిస్తున్న దర్శకుడు కొల్లు కల్కి

సాక్షి: సీరియల్స్ ఏమైనా చేశారా?

కల్కి: తెనాలి రామకృష్ణుడు సీరియల్‌కు దర్శకత్వం వహించాను. అది త్వరలో ప్రముఖ టీవీ చానల్‌లో ప్రసారం కానుంది.

సాక్షి: ప్రస్తుతం చేస్తున్న సనిమాలు?

కల్కి: సెల్‌ఫోన్ మనిషి జీవితంలో భాగమైపోయింది. ఈ అంశంతో ఫోన్ పోయిందా... ప్రాణం గోవిందా అనే వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నా. అదే విధంగా గ్రామ వలంటీర్ అనే సినిమాకు దర్శకత్వం వహించాను. అది త్వరలో ఓటీటీ వేదికగా రిలీజ్ కానుంది.

సాక్షి: భవిష్యత్తులో ప్రణాళిక ఏంటి?

కల్కి: ప్రస్తుతం ఓ మంచి ప్రేమ కథ సిద్ధం చేశా. ఇప్పటికే పలువురు నిర్మాతలకు కథ వినిపించా. త్వరలో పెద్ద సినిమాతో మీ ముందుకు వస్తా. అదే విధంగా అనకాపల్లి జిల్లాకు సంబంధించిన ఓ కథను సిద్ధం చేస్తున్నాను.

ప్రాణాలతో చెలగాటం



నగరంలో కొంత మంది ఆటోడ్రైవర్లు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిర్లక్ష్యంగా పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నారు. సీట్లలోనే కాకుండా వెనుక కూడా ఎక్కించి తీసుకెళ్తున్నారు. తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం గమనార్హం. దురదృష్టవశాత్తు ఏదైనా జరిగితే.. బాధ్యత ఎవరిది?

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గాలి నాణ్యత మెరుగునకు చర్యలు

అల్లిపురం: నగరంలో గాలి నాణ్యత మెరుగుపరచేందుకు జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీఈపీడీసీఎల్, ఆర్టీవో, ఏపీఎస్ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసు, వ్యవసాయ శాఖ, గ్రేటర్ విశాఖ సిటిజన్ ఫోరం ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన జంక్షన్లను విస్తరించే పనులు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో 250 కిలోమీటర్ల రోడ్లను మెకానికల్ స్వీపింగ్ యంత్రాలతో శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. వ్యర్థాలను తరలిస్తున్నప్పుడు టార్పాలిన్‌లతో పూర్తిగా కప్పి ఉంచాలని సూచించారు. రోడ్లపై ధూళిని తగ్గించేందుకు 40 అడుగులపైగా వెడల్పు ఉన్న ప్రధాన రహదారులను ఎండ్ టు ఎండ్ రోడ్లుగా మార్పు చేస్తామన్నారు. పరిశ్రమల నుంచి వెలువడే విషవాయువులను నియంత్రించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రోజూ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించి అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, రౌండ్ అబౌట్‌లు నిర్మించేందుకు ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే విభాగాలకు సహకరిస్తామని కమిషనర్ తెలిపారు.

నేడు, రేపు బీపీఎంఎస్ సమావేశాలు

మద్దిలపాలెం: భారతీయ ప్రతిరక్షా మజ్దూర్ సంఘ్ ఆఫీస్ బేరర్స్ సమావేశాలు బుధ, గురువారాల్లో సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోగల స్మార్ట్ ఇన్ హోటల్‌లో నిర్వహిస్తున్నామని సంఘ్ కార్యదర్శి పి.విద్యాసాగర్ తెలిపారు. ఈ సమావేశానికి దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి 40 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమావేశాలకు ముఖ్యఅతిథిగా విశ్రాంత భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ ప్రిన్సిపాల్ అడ్వైజర్ లెఫ్టినెంట్ జనరల్ వినోద్ జి ఖండారే హాజరుకానున్నారని తెలిపారు. రక్షణ ఉద్యోగుల పనిపరిస్థితులు మెరుగుదలకు పాలసీ, సంక్షేమం ఇతర అంశాలపై చర్చించనున్నామన్నారు.

తుప్పల్లో పసికందు మృతదేహం

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వెనుక భాగంలోని తుప్పల్లో మంగళవారం రాత్రి నెలలు నిండని ఓ పసికందు మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. ఆ పసికందుకు 5–6 నెలల వయసు ఉండొచ్చని భావిస్తున్నారు. అబార్షన్ ద్వారా బయటపడిన ఈ పసికందును గుర్తు తెలియని వ్యక్తులు తుప్పల్లో విడిచిపెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. కాగా.. శిశువు మృతదేహానికి చీమలు పట్టి ఉన్నాయి. దీనిపై వాడచీపురుపల్లి వీఆర్వో రొంగలి హేమలత మంగళవారం రాత్రి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శిశువు మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ మల్లికార్జునరావు చెప్పారు.